మహబూబాబాద్ జిల్లా గార్ల రెవెన్యూ సదస్సులో రైతులు, విపక్ష పార్టీల నాయకులను సముదాయిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఎమ్మెల్యే కనకయ్యను అడ్డగించిన రైతులు

గందరగోళంగా గార్ల రెవెన్యూ సదస్సు

గార్ల పెద్దచెరువు శిఖంభూమి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్

గార్ల, జూన్ 10 : ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు నిరసన సెగ తగిలింది. మహబూబాబాద్ జిల్లా గార్ల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరుకాగా.. గార్ల పెద్ద చెరువు శిఖం భూమికి ట్రెంచ్ కొట్టి హద్దులు ఏర్పాటు చేయలేదంటూ రైతులతో కలిసి విపక్ష పార్టీల నాయకులు ఆయన్ను అడ్డుకున్నారు. దీంతో సదస్సు గందరగోళంగా మారింది. గార్ల పెద్దచెరువు శిఖం భూమి సర్వే నంబర్ 766లో సుమారు 150 ఎకరాలకుపైగా కబ్జాకు గురైందని, కొందరు రైతులు భూమిని కబ్జా చేసి రెవెన్యూ అధికారులకు కాసులు చెల్లించి పట్టాలు చేయించుకున్నారని వారు ఆరోపించారు. ఇటీవల రెవెన్యూ అధికారులు కబ్జాకు గురైన భూమిని సర్వే చేసినా.. ట్రెంచ్ కొట్టి హద్దులు ఏర్పాటు చేయలేదని వారు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. పెద్ద చెరువులో కొందరు రైతులు బావులు తవ్వి, విద్యుత్తు మోటర్లు పెట్టుకొని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే హద్దులు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఆయిల్‌పామ్ సాగు

5లక్షల ఎకరాలకు పెంచాలి

మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని 5లక్షల ఎకరాలకు పెంచాలని, ఇందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆకస్మికంగా ఆయిల్‌ఫెడ్‌ను సందర్శించిన తుమ్మల.. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి.. రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించేలా కృషి చేయాలని కోరారు. ఆయిల్‌పాం నర్సరీలపై మరింత పర్యవేక్షణ పెంచడంతోపాటు, నర్సరీలోనే మొక్కల నాణ్యతను గుర్తించాలని తెలిపారు. రైతులకు అంతర పంటల విషయంలో సరైన అవగాహన కల్పించాలని, అందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని సూచించారు. జూలై నాటికి సిద్దిపేట జిల్లాలో నిర్మితమవుతున్న నర్మెట్ట ఆయిల్‌పాం ఫ్యాక్టరీని పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయిల్‌ఫెడ్ ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులను కూడా మార్కెటింగ్ చేసి సంస్థను ప్రగతిపథంలో నడిపించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈడీ ప్రశాంత్‌కుమార్, ఓఎస్డీ కిరణ్‌కుమార్, జీఎం సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిని కాపాడాలి

కెఫెటేరియా, 11 గిరిజన ఆలయాలను ప్రారంభించిన సీతక్క

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన మ్యూజియంలో గిరిజన కెఫెటేరియాతోపాటు, 11 గిరిజనులకు చెందిన ఆలయాలను ఆవిష్కరించారు. అనంతరం మ్యూజియంలో ఏర్పాటు చేసిన గొండు మహిళలు, గిరిజనులు తయారు చేసిన ఇప్ప లడ్డూలు, ఇప్ప బూరెలు, ఇప్పచాట్ మసాలా, జొన్నరొట్టెలు, బోటికూర, స్వీట్లు తదితర పదార్థాలను ఆమె రుచి చూశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఏ శరత్, సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ వీ సముజ్వల, మ్యూజియం క్యూరేటర్ డీ సత్యనారాయణ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, జీసీసీ చైర్మన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని, మనుస్మృతిని అమలు చేయాలనే కుట్రలో బీజేపీ నాయకత్వం ఉన్నదని ధ్వజమెత్తారు. 'జై బాపు-జై భీమ్- జై సంవిధాన్' పేరిట దేశవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లేలా మోదీ, అమిత్ షా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయ స్వలాభం కోసం బీజేపీ మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు.

కడియం శ్రీహరిపై అధిష్ఠానానికి ఫిర్యాదు

పార్టీ నేతలను పట్టించుకోవడం లేదని కార్యకర్తల ఫైర్

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు ఎక్కువైంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఆ నియోజకవర్గానికి చెందిన ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ ఇండ్లను తన అనుచరులకే ఇస్తున్నాడని, అర్హులను ఎంపిక చేసే విషయంలో కూడా కడియం శ్రీహరి అనుచరులు అవకతవకలకు పాల్పడుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీ మారి తన వెంట కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికే కడియం శ్రీహరి ప్రాధాన్యం ఇస్తున్నాడని ఫిర్యాదులో వెల్లడించారు. వారికే వివిధ కమిటీల్లో ప్రాధాన్యం ఇస్తున్నాడని, ఎన్నో ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వాళ్లను పట్టించుకోవడం లేదని ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

లంబాడీ ఎమ్మెల్యేల రహస్య భేటీ!

మంత్రి పదవి దక్కకపోవడంపై నేతల అసంతృప్తి

త్వరలో ఆత్మగౌరవ సభ పెట్టాలని నిర్ణయం

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గ విస్తరణ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అలజడి రేపుతున్నది. క్యాబినెట్ విస్తరణలో తమ సామాజిక వర్గానికి చోటు దక్కలేదన్న అసంతృప్తితో ఉన్న లంబాడీ ఎమ్మెల్యేలు మంగళవారం రహస్య సమావేశం నిర్వహించినట్టు తెలిసింది. సమావేశంలో పలువురు లంబాడీ ప్రజాప్రతినిధులు, ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నేతలు కూడా పాల్గొన్నట్టు సమాచారం. క్యాబినెట్ విస్తరణలో తమకు అన్యాయం జరిగిన నేపథ్యంలో బంజారాల ఆత్మగౌరవ సభ పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. మంత్రి పదవి కేటాయించేవరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు, ధర్నాలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. 50 ఏండ్లుగా ప్రతి ప్రభుత్వంలో తమకు మంత్రి పదవి ఉండేదని లంబాడీ ఎమ్మెల్యేలు గుర్తుచేసుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకపక్షంగా కాంగ్రెస్‌కు ఓటు వేసినప్పటికీ, తమకు అన్యాయం జరుగుతున్నదన్న ఆవేదన లంబాడీ సామాజిక వర్గంలో వ్యక్తమవుతున్నది. మంత్రి పదవి ఇవ్వకపోతే రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలపై బంజారా సంఘాల నేతలు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

శాఖలపై పీటముడి

- మంత్రులకు శాఖల కేటాయింపులో అయోమయం
- ప్రక్షాళనకు అధిష్ఠానం మొగ్గు.. సీఎం శాఖలను పంచే యోచన
- హోం, మున్సిపల్ శాఖలు తన వద్దే ఉండాలని రేవంత్ పట్టు
- సీనియర్ మంత్రులతో చర్చించాలన్న రాహుల్‌గాంధీ
- ఒక్కొక్కరుగా సీనియర్ మంత్రులకు ఢిల్లీ నుంచి పిలుపు
- భార్యతో కలిసి ఢిల్లీకి ఉత్తమ్, ఆ వెనుకే భట్టివిక్రమార్క

హైదరాబాద్, జూన్10 (నమస్తేతెలంగాణ): మంత్రుల్లో ఎవరికి ఏ శాఖ కట్టబెడతారనే అంశం కాంగ్రెస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముగ్గురు కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఏ ఇద్దరు కలిసినా శాఖల కేటాయింపులపైనే చర్చించుకుంటున్నారు. ఫైల్ పట్టుకుని రేవంత్‌రెడ్డి విమానమెక్కడంతో ఈ చర్చ మరింత ఊపందుకున్నది. పాత మంత్రుల శాఖల్లో ప్రక్షాళన చేసి కొత్త వారికి ఇస్తారా? లేదంటే, ముఖ్యమంత్రి వద్ద ఉన్నశాఖలను కేటాయిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. రేవంత్‌రెడ్డి రెండు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేశారు. మొదటి రోజు కేసీ వేణుగోపాల్‌తో చర్చలు జరిపిన సీఎం మంగళవారం పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీని కలిశారు. ఈ క్రమంలో అనూహ్యంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, ఆ తర్వాత కాసేపటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఢిల్లీ నుంచి పిలుపువచ్చింది. ఆ వెంటనే ఉత్తమ్ తన భార్య పద్మావతితో వెళ్లగా, భట్టి మరో విమానంలో ఢిల్లీ వెళ్లారు. మరో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కూడా ఢిల్లీ నుంచి పిలుపు వచ్చే అవకాశం ఉన్నదని సమాచారం. అధిష్ఠానం నుంచి పిలుపు రావడం వెనుక మంత్రులకు శాఖల కేటాయింపేనా? లేదంటే పార్టీపరంగా ఎదైనా కీలక మార్పు ఉండబోతున్నదా? అన్నది కాంగ్రెస్ వర్గాల్లో సస్పెన్స్‌గా మారింది.

శాఖల ప్రక్షాళన

ఇప్పుడిప్పుడే పాలన కుదురుకుంటున్న నేపథ్యంలో శాఖల ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా అధిష్ఠానం మాత్రం ప్రక్షాళన అవసరమేనని స్పష్టం చేసినట్టు తెలిసింది. ముఖ్యంగా సీఎం వద్దనున్న కీలక శాఖలను మంత్రులకు పంచాలని రాహుల్‌గాంధీ తేల్చి చెప్పినట్టు సమాచారం. సీనియర్ నేతలకు అప్పగించిన శాఖల్లో అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వారి శాఖలు మార్చాలని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, శ్రీధర్‌బాబుకు పాలనలో మరింత బాధ్యత పెంచాలని సూచించినట్టు సమాచారం. దీంతో వారి శాఖల్లో మార్పులు చేర్పులు జరుగుతాయని ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి వద్ద కీలకమైన హోంశాఖ, విద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్, కమర్షియల్ ట్యాక్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, ఎస్సీఎస్టీ మైనార్టీ వెల్ఫేర్, న్యాయశాఖ, కార్మిక శాఖ, పశుసంవర్ధక శాఖ, మైన్స్ అండ్ జియాలజీ, క్రీడలు, యువజన సర్వీస్‌లతో పాటు మరికొన్ని కీలక శాఖలు ఉన్నాయి. వీటిలో హోంశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలను సీనియర్ మంత్రులకు ఇవ్వాలని అధిష్ఠానం సూచించినట్టు తెలిసింది.

తన శాఖలను వదులుకునేందుకు సీఎం ససేమిరా..!

ముఖ్యమంత్రి రేవంత్ వద్దనున్న శాఖల్లో హోంశాఖ, విద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలు కీలకమైనవి. వీటిని వదులుకునేందుకు ఆయన ససేమిరా అంటున్నట్టు తెలిసింది. తప్పని పరిస్థితుల్లో వీటిని మంత్రులకు కేటాయించాల్సి వస్తే ఆ శాఖలను రెండుముక్కలుగా చేసి తల భాగం తన వద్దే అట్టిపెట్టుకొని, మొండాన్ని మాత్రం మంత్రులకు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. హోంశాఖ నుంచి లా అండ్ ఆర్డర్‌ను వేరుచేసి దానిని తన వద్ద ఉంచుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. అది పోగా మిగిలిన విభాగాలన్నిటినీ హోంశాఖ పేరుతో మరో మంత్రికి కేటాయించాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే, మున్సిపల్ శాఖను మాత్రం వదులుకునేందుకు సీఎం ఇష్టపడటం లేదని సమాచారం. ఒకవేళ తప్పనిసరిగా ఇవ్వాల్సి వస్తే మాత్రం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను ఒక శాఖగా, అర్బన్ డెవలప్‌మెంట్‌ను మరో శాఖగా విభజించి.. అర్బన్ డెవలప్‌మెంట్‌శాఖను తనకు ఇవ్వాలని అధిష్ఠానాన్ని సీఎం కోరినట్టు సమాచారం.

మంత్రుల 'గ్రేడ్'వార్!

మొదటిపేజీ తరువాయి...

మంత్రుల పనితీరు, ప్రజలతో మమేకమైన తీరు, అంతిమంగా వారి వలన పార్టీకి ఒనగూరిన లాభం, జరిగిన నష్టం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఏ, బీ, సీ,డీ గ్రేడ్లు ఇచ్చినట్టు మంత్రులకు సీఎం వివరించినట్టు తెలిసింది. ఉత్తర తెలంగాణకు చెందిన ఒక మంత్రికి, దక్షిణ తెలంగాణకు చెందిన మరో మంత్రికి డీ గ్రేడ్లు, దక్షిణ తెలంగాణ జిల్లాకే చెందిన మరో మంత్రికి సీ గ్రేడ్ వచ్చిందని ఫలితాలను మంత్రుల ముందు పెట్టినట్టు సమాచారం. సీఎంకు కొంత సమీపంగా ఉండే ఇద్దరు మంత్రులకు మినహా మిగిలిన మంత్రి వర్గం అంతా బీ,సీ,డీ గ్రేడ్లలోనే ఉన్నట్టు తెలిసింది. మంత్రుల పనితీరుపై అధిష్ఠానం దృష్టిసారించిందని సీఎం వారికి చెప్పినట్టు తెలిసింది.

భగ్గుమన్న మంత్రులు..

గ్రేడింగ్‌లపై మంత్రులు ఒక్కసారిగా భగ్గుమన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. సీ గ్రేడ్ వచ్చిన దక్షిణ తెలంగాణ జిల్లాకు చెందిన మంత్రిని సీఎంను లక్ష్యంగా చేసుకొని తీవ్రమైన వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. కాగా, అధిష్ఠానం మంత్రులకు మాత్రమే గ్రేడింగ్ ఇచ్చిందా? మీకు ఇవ్వలేదా అని మంత్రులు నిలదీసినట్టు సమాచారం. రోజు రోజుకు ఎమ్మెల్యేల మద్దతు తగ్గుతున్న మీకు అధిష్ఠానం ఎలాంటి గ్రేడింగ్ ఇచ్చిందని వ్యంగ్యాస్త్రం సంధించినట్టు తెలిసింది. మొదట్లో మీరు ఎటువంటి నిర్ణయం తీసుకున్నా సంపూర్ణంగా మద్దతు ఇచ్చే 19 మంది ఎమ్మెల్యేల సంఖ్య ఇప్పుడు15కు పడిపోయిందని అంటున్నారని, అధిష్ఠానం మీ పనితనం కూడా పరిగణలోకి తీసుకుని ఉంటుంది గదా? మీ రిపోర్టు కూడా ఇక్కడ పెట్టండని గట్టిగా నిలదీసినట్టు సమాచారం. సదరు మంత్రి వ్యాఖ్యలకు మద్దతుగా మిగిలిన మంత్రులు గ్రేడింగ్‌పై గట్టిగానే ప్రశ్నించినట్టు తెలిసింది. ఏ పథకం సక్కగ అమలు చేశామని ప్రజలకు చెప్పుకుంటూ తిరగాలని మంత్రులు ఎదురు తిరిగినట్టు తెలిసింది. మనం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా యువత కోసం పథకం తీసుకొస్తే, దాన్ని కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని మంత్రి ఒకరు నిలదీసినట్టు తెలిసింది. యువతకు ఉపాధి చూపించకుండా స్థానిక ఎన్నికలకు ఎలా వెళ్లగలమని నిలదీసినట్టు సమాచారం. డీ గ్రేడ్ వచ్చిన మంత్రి సభలోనే కన్నీళ్లు పెట్టినట్టు తెలిసింది. ఈ 17 నెలల కాలం నుంచి తనను సుఖంగా ఉండనియ్యలేదని, ఏదో ఒక ఆరోపణతో తనను పలుచన చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం.

ధాన్యం కొనుగోళ్ల పక్కన పెట్టి అందాల పోటీలకు నిధులా?

'అరకొర రుణమాఫీ, ఆగిన రైతుభరోసా పెట్టుబడి సాయం, ఎక్కడి ధాన్యం అక్కడే, మళ్లీ ఎరువుల కొరత, విత్తనాల కొరత ఇలా ప్రతి అంశంలోనూ రైతులు మళ్లీ గోస పడుతున్నారు. దీనికి మనమే కారణమనే అభిప్రాయంతో రైతులు ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జనం వద్దకు పోయి ఏం చెప్పమంటారు' అని సీనియర్ మంత్రి ఒకరు నిలదీసినట్టు తెలిసింది. రైతుభరోసా పథకాన్ని మూడు ఎకరాల వరకు ఇచ్చి పథకాన్ని అర్ధాంతరంగా నిలిపివేశామని, ఈ పథకం కింద యాసంగి సీజన్‌కు రూ. 9,300 కోట్లు ఇవ్వాల్సి ఉండగా రూ. 5 వేల కోట్లు కూడా పంచలేకపోయామని సదరు మంత్రి ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. రైతుబీమా, విత్తనాలకు సంబంధించి ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కాలేదని లెక్కలు చెప్పినట్టు సమాచారం. రైతు పథకాలకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని సీఎంను గట్టిగానే నిలదీసినట్టు తెలిసింది.

సీఎం ముక్తాయింపు..

మెరుగైన ఫలితాలు సాధించని మంత్రులను ఆయా శాఖల నుంచి తప్పించి వారికి వేరే శాఖలు కేటాయించే అవకాశం ఉన్నదని సీఎం రేవంత్ తేల్చి చెప్పినట్టు తెలిసింది. స్థానిక ఎన్నికల్లో వందకు వంద శాతం ఫలితాలు సాధించిన వారికి శాఖల పునర్వ్యవస్థీకరణలో ప్రాముఖ్యత ఉంటుందని అధిష్ఠానం చెప్పమన్నట్టుగా సీఎం ముక్తాయింపు ఇచ్చినట్టు తెలిసింది.

గొల్ల కురుమలకు మొండిచెయ్యి

- పీసీసీ కార్యవర్గంలో దక్కనిచోటు
- 96 మందిలో ఒకే ఒక్క యాదవ నేత

- మంత్రివర్గంలో అసలు చోటే లేదు
- కార్పొరేషన్ చైర్మన్లలోనూ అన్యాయం
- అధిష్ఠానంపై రగిలిపోతున్న గొల్లకురుమలు
- ఇదేనా సామాజిక న్యాయమంటూ ప్రశ్నలు
- స్వార్థం కోసం వచ్చినవాళ్లకు, పైసలిచ్చేవాళ్లకు పైరవీకారులకు పదవులు ఇచ్చారంటూ ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధిష్ఠానంపై గొల్లకురుమ నేతలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సోమవారం ప్రకటించిన పీసీసీ కార్యవర్గంలో తమ వర్గానికి చోటు కల్పించకపోవడంపై మండిపడుతున్నారు. 27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది జనరల్ సెక్రటరీలు మొత్తం 96 మందితో ఏర్పాటుచేసిన జంబో కార్యవర్గంలో ఒకే ఒక్క యాదవ నేతకు చోటు కల్పించారు. కాంగ్రెస్ అధిష్ఠానం రాయగిరి కల్పనా యాదవ్‌ను పీసీసీ జనరల్ సెక్రటరీగా నియమించింది. అదే సమయంలో బీసీల్లోనే ఒక వర్గానికి ఏకంగా 14 పోస్టులు ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యంలో సామాజిక న్యాయం? రాష్ట్ర జనాభాలో 18.5% ఉన్న గొల్ల కురుమలకు పదవుల్లో కనీసం 1% కూడా ఇవ్వరా? అని ప్రశ్నిస్తున్నారు. గత కార్యవర్గంలో ఎనిమిది మంది గొల్ల కురుమ నేతలకు స్థానం ఉండేది. జనరల్ సెక్రటరీలు నలుగురు ఉండగా, వైస్ ప్రెసిడెంట్ పదవి ఒకటి ఉండేది. కానీ తాజా కమిటీలో ఒకే ఒక్కరికి అవకాశం కల్పించారు.

ప్రభుత్వం.. పార్టీలోనూ చోటు లేదు..

కాంగ్రెస్ పాలనలో గొల్ల కురుమ నేతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అటు ప్రభుత్వ పదవుల్లో, ఇటు పార్టీ పదవుల్లోనూ చోటు దక్కడంలేదు. మంత్రివర్గంలో ఒక్కరు కూడా ఈ వర్గానికి చెందిన వారు లేరు. యాదవ నేత లేకుండా మంత్రివర్గం ఉండటం ఇదే తొలిసారని చెప్తున్నారు. కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలోనూ గొల్ల కురుమలకు ఒక్క పదవి కూడా దక్కలేదు. కనీసం పార్టీ పదవుల్లో అయినా చోటు దక్కుతుందని భావించిన ఆ వర్గం నేతలకు నిరాశే మిగిలింది. 96 మందిలో ఒకేఒక్క యాదవ నేతకు చోటు దక్కింది. అడ్వైజరీ కమిటీలో అంజన్ కుమార్‌యాదవ్‌కు మాత్రమే చోటు కల్పించిన అధిష్ఠానం మరే కమిటీలోనూ గొల్ల కురుమలకు స్థానం ఇవ్వలేదు.

పైరవీకారులకే పదవులా?

కార్యవర్గంలో ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి స్థానం కల్పించడంపై గొల్ల కురుమ నేతలు మండిపడుతున్నారు. ఎన్నో ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్నవారిని కాదని, నిన్న మొన్న వారి స్వార్థం కోసం పార్టీలోకి వచ్చిన వారికి, పైరవీలు చేసేటోళ్లకే పదవులిస్తరా? అని ప్రశ్నిస్తున్నారు. 2017 నుంచి పార్టీలో ఉన్నవారికే పదవులంటూ సన్నాయి నొక్కులు నొక్కి ఇప్పుడు అడ్డదిడ్డంగా పదవులు ఇచ్చారంటూ రగిలిపోతున్నారు. ఈ మధ్యకాలంలోనే పార్టీలోకి వచ్చిన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బొంతు రామ్మోహన్, జగదీశ్‌గౌడ్, రామారావుగౌడ్, జగదీశ్వర్‌రావు, భూషణం, గోవింద రావు వంటి నేతలకు కార్యవర్గంలో చోటు కల్పించడంపై ఆభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

బీఆర్ఎస్ సర్కారే నయం..

కాంగ్రెస్ ప్రభుత్వం కన్నా బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే తమకు మేలు జరిగిందన్న అభిప్రాయాన్ని గొల్ల కురుమ నేతలు వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో, పార్టీలో రెండింటిలోనూ గొల్ల కురుమలకు తగిన ప్రాధాన్యం లభించిందని గుర్తుచేసుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంత్రి పదవి, బడుగుల లింగయ్యాయాదవ్‌కు రాజ్యసభ, ఎగ్గె మల్లేశంకు ఎమ్మెల్సీ పదవితోపాటు నలుగురికి కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం ఇచ్చిందని గుర్తుచేసుకుంటున్నారు. సర్కారు గొల్ల కురుమలను నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడుతున్నారు.

యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి : దూదిమెట్ల

రాష్ట్ర మంత్రివర్గంలో యాదవ-కురుమలకు స్థానం కల్పించాలని తెలంగాణ గొర్రెల, మేకల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్‌ను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రజాక్షేత్రంలో చీల్చిచెండాడుతామని మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చీమునెత్తురూ ఉంటే కాంగ్రెస్‌లోని యాదవ నాయకులైన అంజన్‌కుమార్, అనిల్, బీర్ల ఐలయ్య, చరణ్ తదితరులు మాల, మాదిగ నాయకులను చూసి బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. లేదంటే ముక్కునేలకు రాసి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఎవరు డబ్బులివ్వకున్నా..

ఇడిసిపెట్టేది లేదు!

- ఎన్నికల ఖర్చు రాబట్టుకుంటున్న
- రోజుకు రూ.లక్ష ఖర్చవుతున్నది..
- స్టింగ్ ఆపరేషన్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు
- లిక్కర్ సిండికేట్ నిర్వాహకులను డబ్బు అడుగుతున్న వీడియో వైరల్
- పోలీసులకు ఎమ్మెల్యే ఫిర్యాదు

సూర్యాపేట, జూన్ 10 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మరో వివాదంలో చిక్కుకున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్‌లో కుమ్ములాటలతోపాటు పలు ఆరోపణలు ఆయనపై వస్తుండగా, తాజాగా ఓ స్టింగ్ ఆపరేషన్‌లో ఆయన బండారం బట్టబయలైంది. మద్యం సిండికేట్ నిర్వాహకుల నుంచి ఎమ్మెల్యే మామూళ్లు అంటూ ఓ వీడియో వైరల్ అవుతుండగా, వైన్స్ యజమానులతో ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు అర్థం అవుతున్నది. ఎమ్మెల్యే సామేల్‌తో బేరసారాలాడుతూ మద్యం మాఫియా స్టింగ్ ఆపరేషన్ చేసినట్టు సమాచారం. ఎమ్మెల్యే మామూళ్ల వ్యవహారం బయటపెట్టాలనే ఉద్దేశంతోనే సీక్రెట్ కెమెరాతో సిండికేట్ మాఫియా ఆపరేషన్ చేసిందని ప్రచారం. 'ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టా.. అదంతా రికవరీ కావాలి. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తనో? లేదో? తెలియదు.. నాకు రోజుకు రూ.లక్ష ఖర్చు వస్తుంది.. డీజీలకు కూడా డబ్బులిచ్చేవ్.. ప్రభుత్వం ఇచ్చే జీతం సరిపోవ డంలేదు.. మీరిచ్చే మామూలు నాకు టీ ఖర్చులకు కూడా సరిపోవు.. నా మాట వినని వారి సంగతి చూస్తా' అంటూ ఎమ్మెల్యే సామేల్ అన్న వ్యాఖ్యలు ఆ వీడియోలో వినిపిస్తున్నాయి.

సొంతపార్టీలోనే కుంపటి..

ఎమ్మెల్యే మందుల సామేలుకు సొంత పార్టీ నేతలతో పొసగడం లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కార్యకర్తలు తరచూ ఆరోపిస్తున్నారు. ఇసుక విషయంలో తట్టెడు కూడా ఎత్తనివ్వనని ఎన్నికల ముందు ఊరూరా తిరిగి ప్రచారం చేసి.. నేడు ఆయన తన కుమారులతోనే దందా నడిపిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు వీడియోలతో సహా గతంలో బయటపెట్టారు. పోలీసులకు చెప్పి ఎమ్మెల్యే చితక బాదించారని మనస్తాపంతో శాలిగౌరారం మండలానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డడన్న ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. అలాగే అనేక సందర్భాల్లో సొంతపార్టీ నాయకులను ఇబ్బందులు పెట్టారని పలువురు ఆరోపిస్తున్నారు.

నాపై అసత్య ఆరోపణలు : ఎమ్మెల్యే సామేలు

తనపై వస్తున్న అవినీతి ఆరోపణలపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు స్పందించారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తూ వీడియో తీసిన వ్యక్తులపై విచారణ జరిపించాలని తుంగతుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లోకి వచ్చి టీ తాగిన వారే ఇంకా వీడియోలు ఉన్నాయంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తీన్మార్ మల్లన్నకు చెందిన వ్యక్తులు కూడా ఇందులో ఉన్నారని, కావాలనే తీన్మార్ మల్లన్న తనపై బ్లాక్‌మెయిల